







## డ్రైవింగ్ స్కూల్ 17వ బ్యాచ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపీఎస్ ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 17వ బ్యాచ్ హెవీ డ్రైవింగ్ శిక్షణకు గాను లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగినవారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్‌లో ప్రారంభమయ్యే 17వ బ్యాచ్‌లో 16 మందికే అవకాశం ఉంటుందని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఫీజు, ఇతర వివరాలకు 73829 23293, 70950 40608, 73829 24758 నెంబర్లను సంప్రదించాలని విజయ కుమార్ ఆ ప్రకటనలో సూచించారు.

## 27న ఆదిత్యుని హుండీ లెక్కింపు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం హుండీలను ఈ నెల 27న మంగళవారం ఉదయం 8 గంటలకు దేవదాయ, ధర్మాదాయ శాఖ సిబ్బంది, అనువంశిక ధర్మకర్త, పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు, గ్రామపెద్దల సమక్షంలో హుండీలను తెరవనున్నట్లు ఉప కమీషనర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 24-8-2024

సంపుటి: 20 సంచిక: 130

పేజీలు: 4 వెల: రూ.1




# బదిలీలైతే... బాగోతాలు బయటపడతాయి!

- కొత్త ప్రభుత్వంలోనూ పాతవారే కొనసాగే యత్నాలు
- రెవెన్యూలో ప్రహసనంగా మారిన బదిలీలు
- రాజకీయ ప్రమేయంతో ఏళ్ల తరబడి ఒకేచోట తిష్ట
- తహసీల్దార్ నుంచి వీఆర్వో వరకు ఇదే పరిస్థితి
- ఇదే అదనుగా రికార్డుల తారుమారు, గల్లంతు

అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఇక్కడున్న కొన్ని సామాజికవర్గాలకు ప్రతీ రాజకీయ నాయకుడితోను బీరకాయ పీచు చుట్టరికం ఉంటుంది. వైకాపా అధికారంలో ఉంటే ఒకరితోను, టీడీపీ అధికారంలోకి వస్తే మరొకరితోను చెప్పించుకునే బంధుత్వాలు నెరుపుతుంటారు. గత పాలనలో ఆ పార్టీ చేయించిన అరాచకాలన్నింటికీ వంతపాడి, ఇప్పుడు అదే స్థానంలో బదిలీ లేకుండా కొనసాగిస్తే అదే విధంగా సాయపడతామన్న ధోరణిలో ఇక్కడి రెవెన్యూ ఉద్యోగులు రాజకీయ నాయకులకు సంకేతాలు పంపిస్తున్నారు. అయ్యతరపు బాగారి వైకాపా నేతకు చుట్టమైతే, అమ్మ తరపు మేనమామ టీడీపీ నేతలకు చుట్టమవుతాడు. కాబట్టి ఎవరొచ్చినా తమకు జరిగే నష్టమేమీ లేదన్న భావనలో రెవెన్యూ ఉద్యోగులు వారిలో వారే సీట్ల సర్దుబాటు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒకచోట పనిచేసినవారిని కచ్చితంగా బదిలీ చేయాలని మరోసారి ప్రభుత్వం నొక్కివక్కాణిస్తే ప్రత్యామ్నాయంగా ఎక్కడికి వెళ్లాలన్న దాని మీద ఇప్పటికే సీట్లు సర్దుబాటు చేసుకుంటున్నారు. ఉదాహరణకు శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఈ ప్రభుత్వంలో కూడా బదిలీ కాకూడదని ప్రయత్నిస్తున్నారు. ఒకవేళ కాదూ కూడదూ అంటే పక్కనే ఉన్న గార వెళ్లడానికి ప్లేస్ రిజర్వ్ చేసుకుంటున్నారు. అలాగే గార నుంచి వైకాపాతో అంటకాగిన వ్యక్తి శ్రీకాకుళం వస్తారు. కలెక్టరేట్‌లో డీటీగా చేస్తున్న వ్యక్తి శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయానికి వస్తారు. తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న వ్యక్తి కలెక్టర్ ఆఫీసుకు వెళ్తారు. అంతేకాని మారుమూల ప్రాంతాల్లో సుదీర్ఘ కాలంగా మగ్గిపోతున్నవారికి మాత్రం అవకాశం ఇవ్వరు. కూటమి ప్రభుత్వం వచ్చింది, కూకటివేళ్లతో పాతవారిని మార్చేస్తుందనుకోవడం పొరపాటే. ఎవరి స్థాయిలో వారు టీడీపీ ఎమ్మెల్యేలను, మంత్రులను వారి వారి అనుంగుల ద్వారా కలిసి సిఫార్సు లేఖలు తెచ్చుకుంటున్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి పెద్ద ఎత్తున డిమాండ్ ఉండటంతో ఎమ్మెల్యే గొండు శంకర్ కార్యాలయంలో ఏం జరుగుతుందన్న దానిపై సర్వత్రా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే రెవెన్యూ ఉద్యోగులు మాత్రం శ్రీకాకుళంలో ధర్మాన ప్రసాదరావు ఉన్నా, గొండు శంకర్ ఉన్నా తమ బంధువులేనన్న భావనతో ఉన్నారు. అన్నింటికీ మించి ప్రస్తుతం తాము పని చేస్తున్న సీటును వదిలి దూరంగా పోతే అప్పట్లో తాము చేసిన రికార్డు టాంపరింగ్, భూ పంపకాలు, బినామీ పేర్లతో కొట్టేసిన భూముల వ్యవహారాలు బయటికొస్తాయని, అందుకే ఎంత ఖర్చయినా సీటు వదలడానికి ఇష్టపడటంలేదు. పొరపాటున బదిలీ జరిగితే ఆ స్థానంలో తమ మనుషులనే తెచ్చి కూర్చోబెట్టడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో శ్రీకాకుళం ఎమ్మెల్యే ఏం చేస్తారనేదే ఇప్పుడు ఆసక్తికరమైన చర్చ. ఇప్పటికే జిల్లాస్థాయి పోస్టులకు సంబంధించి మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌లు సంయుక్తంగా ఓ జాబితాను సిద్ధం చేసుకున్నారు. ఇది కాకుండా ఇప్పుడు మిగిలింది దిగువస్థాయి ఉద్యోగులే. సాధారణ బదిలీలో సచివాలయ ఉద్యోగులను కూడా కొత్తగా చేర్చడంతో ఎమ్మెల్యేల కార్యాలయాలపై తీవ్ర ఒత్తిడి ఉంది. గత ఐదు రోజులుగా ఎమ్మెల్యే గొండు శంకర్ వీరికి జడిసి కార్యాలయానికి కూడా రావడంలేదు. దీంతో ఆయన సొంత గ్రామం కిష్టప్పేట వద్ద జనాలు పెద్ద ఎత్తున బారులు తీరుతున్నారు. మరోవైపు కోటబొమ్మాళిలో రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు ఇంటివద్ద కూడా ఇదే పరిస్థితి ఉంది. ఏది ఏమైనా రెవెన్యూ ఉద్యోగులు మాత్రం పెద్ద ఎత్తున ప్రజాప్రతి నిధుల మీద ఒత్తిడి తీసుకువచ్చి, తమ పాపాల పుట్ట బద్దలుకాకుండా చూసుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

వివరాలు 4లో






# చరిత్రలో మాయని మచ్చ.. అజ్మీర్ కీచకపర్వం!


दैनिक नवज्योति

छात्राओं को ब्लैकमेल करने वाले आजाद कैसे रह गये?

- డీవీ రమణ,
సత్యం ప్రత్యేక ప్రతినిధి

**పశ్చిమ బెంగాల్‌లో ఓ మెడికోపై అత్యంత కిరాతకంగా లైంగిక దాడికి పాల్పడి అంత మొందించిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ప్రజల ప్రాణాలను కాపాడే యువ డాక్టర్‌ను ఇంత దారుణంగా చంపడం అందరినీ కలచివేసింది. దీంతో ఈ దారుణానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని యావత్ దేశం డిమాండ్ చేస్తోంది. ఇలాంటి సమయంలో ప్రజలకు న్యాయవ్యవస్థపై నమ్మకం కలిగేలా.. అమ్మాయిల జోలికి వెళ్లడానికి ఆకతాయిలు భయపడేలా వ్యవహరించాలని యావద్దేశం కోరుతుంది. సరిగ్గా ఈ సమయంలోనే దేశ చరిత్రలో మాయని మచ్చగా మిగిలిపోయిన 100 మంది బాలికల అత్యాచారం కేసులో అజ్మీర్ కోర్టు వెలువరించిన సంచలన తీర్పు ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. దేశం మొత్తం మర్చిపోయిన ఈ ఘటన పూర్వపరాలు ఒక్కసారి తెలుసుకుందాం.**

ఇప్పటి కోల్‌కతా మెడికో హత్యాచారం కేసులాగే రాజస్థాన్‌లోని అజ్మీర్ పట్టణంలో సరిగ్గా 32 ఏళ్ల కిందట అమ్మాయిలపై అత్యాచారం వ్యవహారం బయటపడింది. ఒకరిద్దరు కాదు వందలాది మంది విద్యార్థులను బ్లాక్‌మెయిల్ చేసి అత్యాచారానికి పాల్పడ్డారు దుండగులు. యూత్ కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు ఫరూక్ చిష్తీ అమ్మాయిలను బ్లాక్‌మెయిల్ చేసి సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటనలో ప్రధాన నిందితుడు. ఇతడితో పాటు నఫీస్ చిష్తీ, ఇక్బాల్ భాటి, నసీమ్ సయ్యద్, జమీర్ హుస్సేన్, సోహిల్ ఘనీలతో పాటు మరికొందరు అమ్మాయిలపై అత్యాచారానికి పాల్పడిన నిందితులుగా వున్నారు. ఇలా తొమ్మిది మందికి ఇప్పటికే శిక్షపడగా, మరో ఆరుగురికి తాజాగా శిక్షను ఖరారుచేస్తూ అజ్మీర్‌లోని ప్రత్యేక కోర్టు తీర్పు ఇచ్చింది. ఆరుగురు నిందితులకు జీవితఖైదుతో పాటు రూ.5 లక్షల జరిమానా విధించింది న్యాయస్థానం. ఇలా అమ్మాయిలపై అత్యాచారానికి పాల్పడిన 18 మందిలో 15 మందికి శిక్ష పడింది. మిగిలిన ముగ్గురిలో ఒకరు ఆత్మహత్య చేసుకోగా, మరొకడిపై ప్రత్యేక విచారణ కొనసాగుతోంది. ఇంకొకడు పరారీలో వున్నాడు.

**అసలు ఏమిటీ కేసు..**

1992 సమయంలో అజ్మీర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఫరూక్ చిష్తీ ఉన్నాడు. అతడి అండ చూసుకుని అనుచరులు కాలేజీ అమ్మాయిల వెంట పడేవారు. అమ్మాయిలను నమ్మించి ఫామ్‌హౌస్‌లు, రెస్టారెంట్‌లకు తీసుకెళ్లేవారు. వారికి మత్తమందు ఇచ్చి సామూహిక అత్యాచారానికి పాల్పడేవారు. అంతటితో ఆగకుండా అమ్మాయి నగ్నచిత్రాలను తీసుకుని బ్లాక్‌మెయిల్ చేసేవారు.



ఇలా ఫరూక్ చిష్తీ గ్యాంగ్ చేతికి చిక్కిన అమ్మాయిలు నిత్యం నరకం చూసేవారు. నగ్నచిత్రాలతో బెదిరించి తెలిసిన అమ్మాయిలను తమవద్దకు తీసుకురావాలని, లేదంటే ఫోటోలు, వీడియోలను బయటపెడతామని బెదిరించేవారు. ఇలా వందమందికి పైగా అమ్మాయిలను బ్లాక్ మెయిల్ చేసి అత్యాచారానికి పాల్పడింది ఫరూక్ చిష్తీ గ్యాంగ్.

అరాచకాలు బయటపడలేదు. కానీ 1992 వీరి పాపం పండి ఈ బ్లాక్ మెయిల్ అత్యాచారం వ్యవహారం బయటకు వచ్చింది.

1992 అజ్మీర్ సీరియల్ గ్యాంగ్ రేప్, బ్లాక్‌మెయిలింగ్ కేసు భారతదేశంలోని అత్యంత హేయమైన నేరాల్లో ఒకటిగా ఇప్పటికీ పరిగణించబడుతుంది. రాజస్థాన్‌లోని అజ్మీర్ నగరంలో జరిగిన ఈ కుంభకోణంలో వందలాది మంది యువతులు, కొందరు కళాశాల విద్యార్థులు, మరికొందరు పాఠశాలలో చదువుతున్నారు. దైనిక్ నవజ్యోతి అనే స్థానిక పత్రిక కొన్ని నగ్న చిత్రాలను ప్రచురించి, పాఠశాల విద్యార్థులను స్థానిక ముఠాలు బ్లాక్ మెయిల్ చేస్తున్నాయని నివేదించిన తర్వాత కుంభకోణానికి సంబంధించిన వార్తలను ప్రచురించింది. కేసు దర్యాప్తు సమయంలో, ప్రధాన నిందితుడు ఫరూఖ్ చిష్తీ అజ్మీర్ ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రాముఖ్యత కలిగిన

ఈ గ్యాంగ్ చేతిలో 250 మందికిపైగా అమ్మాయిలు బలయినట్లు తెలుస్తోంది. వీరి చేతికి చిక్కిన అమ్మాయిల్లో ఎక్కువమంది 11 ఏళ్ల నుంచి 20 ఏళ్ల లోపువారే. అభంశుభం తెలియని మైనర్ బాలికలపై కూడా ఈ గ్యాంగ్ సామూహిక అత్యాచారానికి పాల్పడేది. విషయం బయటపెట్టకుండా నగ్న ఫోటోలు, వీడియోలను తీసి బెదిరించేది. దీంతో చాలాకాలం వీరి

అజ్మీర్ షరీఫ్ దర్గా ఖాదీమ్ (ధర్మకర్త) కావడంతో పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గారు. కోర్టు చివరికి 18 మంది వరుస నేరస్థులపై అభియోగాలు మోపింది. 2001లో జీవిత ఖైదు విధించిన తర్వాత ఎనిమిది మందిలో నలుగురు నిర్దోషులుగా విడుదలయ్యారు.

### మొదటి బాధితుడు

నివేదిక ప్రకారం, మొదటి బాధితురాలు అజ్మీర్‌లోని సోఫియా సీనియర్ సెకండరీ స్కూల్‌కు చెందిన ఒక బాలిక. ఆమెను ట్రాప్ చేసి ప్రేమ పేరుతో ఉచ్చులో పడేసి దాన్ని ఫొటోలు తీసిన ప్రధాన నిందితుడు ఫరూక్ చిష్తీ ఆ తర్వాత ఆమె ద్వారా అనేక మంది యువతులను రప్పించి, తన మాదిరిగానే ఫొటోలు, వీడియోలు తీసి సామూహికంగా అత్యాచారాలు చేశారు. ఇలా కొంతకాలం ముఠా వారి కార్యకలాపాలను విస్తరించింది. ఫలితంగా అజ్మీర్‌లో వందలాది మంది బాలికలు బలిపశువులయ్యారు. ఇవన్నీ చిష్తీ ఫామ్ హౌస్‌లోనే జరిగాయి.

ఒక కథనం ప్రకారం, సంచలనాత్మక లైంగిక కుంభకోణానికి ఆధారం తొమ్మిదో తరగతి అమ్మాయి, స్థానిక సంపన్న కుటుంబానికి చెందిన - మిగతా 4లో



• ఎడిటోరియల్

# తెలంగాణలో హైడ్రా బాంబ్ కలకలం

ఇప్పుడు తెలంగాణలో ఎక్కడ చూసినా ఒకటే చర్చ. ఇక రాజకీయాల్లో అయితే చెప్పనవసరం లేదు. మరో వైపు బడాబాబులు, రాజకీయాల ముసుగులో ఉన్న రియల్టర్లు, అక్రమ నిర్మాణదారుల గుండెల్లో హైడ్రా బాంబ్ పేలుతోంది. అది ఏ క్షణంలోనైనా తమపై పడవచ్చని ఆ వర్గాలన్నీ వణికిపోతున్నాయి. ఇక బీఆర్ఎస్ అగ్రనేత కేటీఆర్‌కు చెందినదిగా చెబుతున్న జన్వాడ ఫాంహౌస్ విషయంలో హైడ్రా వివాదం రాష్ట్ర హైకోర్టు వరకు వెళ్లింది. అయినా హైడ్రాను అడ్డుకునేందుకు కోర్టు నిరాకరించింది. ఇంతగా ప్రకంపనలు సృష్టిస్తున్న హైడ్రా అంటే ఏమిటి? ఇప్పుడిదే చర్చ సర్వత్రా జరుగుతోంది. తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్ నగరం, దాని చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లోని ఆక్రమణలను గుర్తించి కూల్చివేయడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన సంస్థ హైడ్రా. హైడ్రా అంటే హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్. మున్సిపల్ పరిపాలన శాఖ ఇటీవల జారీ చేసిన జీవో నెం.99 ద్వారా ఈ సంస్థ ఉనికిలోకి వచ్చింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉండే హైడ్రా కమిటీలో మున్సిపల్, రెవెన్యూ మంత్రులతోపాటు హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు, హైదరాబాద్ మేయర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, మున్సిపల్, రెవెన్యూ శాఖల ముఖ్య కార్యదర్శులు సభ్యులుగా ఉన్నారు. మెంబర్ కన్వీనర్‌గా ఐఏఎస్ అధికారి ఏవీ రంగనాథ్‌ను నియమించారు. హైదరాబాద్ నగర విస్తరణకు వీలుగా భూములను గుర్తించడం, ఆక్రమణలు ఉంటే తొలగించడం వంటి చర్యలు చేపట్టడం హైడ్రా ప్రధాన లక్ష్యం. నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో వందలాది చెరువులు, కాలువలు, విలువైన భూములు విచ్చలవిడిగా ఆక్రమణలకు గురయ్యాయి. పక్కా నిర్మాణాలతో రూపురేఖలే కోల్పోయాయి. అలాగే జనజీవనానికి అడ్డంకిగా ఉన్న ఫ్లెక్సీలు, హోర్డింగులు వంటి వాటిని కూడా తొలగించి ట్రాఫిక్, తాగునీరు, విద్యుత్ సరఫరా వ్యవస్థలు అవాంతరాలు లేకుండా పనిచేసేలా చేయడం హైడ్రా ప్రధాన విధులు. ఈ విధుల నిర్వహణకు వీలుగా కఠిన చర్యలు తీసుకునేలా హైడ్రాకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అధికారాలు కట్టబెట్టింది. ఇప్పుడదే చాలామందికి కంటగింపుగా మారింది. నగరం చుట్టుపక్కల రెండువేల కిలోమీటర్ల పరిధిలో హైడ్రా తన అధికారాల కొరడా ఝుళిపిస్తోంది. ఆక్రమణలను గుర్తించి బుల్డోజర్లు, పొక్లెయిన్లతో కూల్చివేస్తోంది. చెరువులు, కుంటలు, కాలువలు, ఇతర విలువైన స్థలాలు ఆక్రమణల చెర నుంచి బయటపడుతున్నాయి. ఆక్రమణల్లో చాలావరకు రాజకీయ అండదండలతోనే జరుగుతాయన్నది జగమెరిగిన సత్యం. దాంతో హైడ్రా కూల్చివేత కార్యకలాపాలకు సహజంగానే రాజకీయాలు అడ్డుతగులుతున్నాయి. అయితే జన్వాడ ఫాంహౌస్ వివాదం రూపంలో హైకోర్టు కూడా హైడ్రాకు అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేయడంతో అక్రమణదారులు, వారి వెనుకనున్న రాజకీయ నేతల గుండెల్లో బాంబులు పేలుతున్నాయి. నగరంలోని కీలక ప్రాంతంలో ఒక చెరువు స్థలాన్ని దాదాపు సగం ఆక్రమించి సినీ నటుడు నాగార్జున నిర్మించిన ఎన్ కన్వెన్షన్‌పై కూడా హైడ్రా దృష్టి పడిందంటున్నారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ అక్రమ నిర్మాణం కూల్చివేతకు అధికార యంత్రాంగం సిద్ధమైనా.. చివరి క్షణంలో అవి నిలిచిపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు పనిచేశాయన్న ఆరోపణలు వినిపించాయి. ఇప్పుడు హైడ్రా దృష్టి సారించి కూల్చివేతలు మొదలెట్టింది. ఇలాంటివే వందలాది అక్రమ నిర్మాణాలను హైడ్రా యంత్రాంగం కూల్చుకుంటూ పోతోంది. ఆక్రమణలను తొలగించడానికి ప్రభుత్వాలు ప్రయత్నించడం, చివరికి రాజకీయ ఒత్తిళ్లతో మమ అనిపించి చేతులెత్తేయడం కొత్త కాదు. కానీ హైడ్రా రూపంలో కఠిన చర్యలు తీసుకోవడానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు పూనుకున్నారన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. చిన్న వయసులోనే.. అదీ అనుకోని రీతిలో ముఖ్యమంత్రి పదవి చేపట్టిన రేవంత్‌రెడ్డి తన హయాంలో ప్రజలకు చిరకాలం గుర్తుండిపోయే పనులు కొన్నయినా చేయాలని భావిస్తున్నారు. వాటిలో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ఒకటి కాగా.. ఇప్పటికే బహుళ రూపాల్లో విస్తరించి రద్దీగా మారిపోయిన హైదరాబాద్ మహానగరంపై ఒత్తిడి తగ్గించేందుకు నగరానికి ఆనుకుని మరో సిటీని అభివృద్ధి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ రెండూ జరగాలంటే విస్తృతంగా భూములు, ఆదాయ వనరులు అవసరం. నగరం, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను తొలగించి ఆ భూములను స్వాధీనం చేసుకుంటే కొత్త నగరాన్ని అభివృద్ధి చేయడానికి భూవసతి సమకూరుతుంది. వాటిలో కొన్ని భూములను డెవలప్‌మెంట్‌కు ఇచ్చినా వేల కోట్ల ఆదాయం సమకూరుతుంది. అలాగే ఆక్రమణలు తొలగిస్తే వాటి కారణంగానే రూపం కోల్పోయి మురుగు కూపంలా మారిన మూసినదిని ప్రక్షాళన చేసి సుందరీకరణ పనులు చేపట్టేందుకు వీలవుతుంది. అలాగే మూసి ప్రాజెక్టుకు, ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు తెలంగాణ ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. అయితే రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు గ్యారెంటీలు కోరడం సహజం. అక్రమ నిర్మాణాలను కూలగొట్టి వేలకోట్ల విలువైన ఆ భూములను హామీగా చూపించి రుణాలు తీసుకోవాలన్నది రేవంత్ రెడ్డి ఆలోచనగా కనిపిస్తోంది. ఒక్క మూసి నదికి ఇరువైపులే సుమారు 56 చెరువులు అక్రమణలకు గురయ్యాయి. వేలాది నిర్మాణాలు అక్రమంగా వెలిశాయి. వాటిని క్లియర్ చేస్తే చాలు సుమారు 120 కోట్ల చదరపు అడుగుల భూమి అందుబాటులోకి వస్తుంది. ఇవన్నీ జరగాలంటే ఇప్పుడున్న మున్సిపల్, రెవెన్యూ వ్యవస్థల వల్ల కాదు. అందుకే హైడ్రా సంస్థను ఏర్పాటు చేసి, దానికి అధికారాల కోరలు అమర్చారు. సిన్సియర్ అధికారి అయిన రంగనాథ్ చేతికి కొరడా అందించారని చర్చ జరుగుతోంది.

# దాడిలో గాయపడ్డ వైకాపా కార్యకర్త మృతి



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

పచ్చటి పల్లెలో రాజకీయ చిచ్చు రేగుతోంది. ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి ఎక్కడో ఒకచోట వైకాపా నాయకులు, కార్యకర్తలపై పచ్చమూకల దాడులు జరుగుతూనే ఉన్నాయి. గత ఆదివారం ఫరీదుపేట గ్రామంలో రాత్రి 11.15 గంటల సమయంలో వైకాపా కార్యకర్త కూన ప్రసాద్‌పై టీడీపీ మూకలు దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో ప్రసాద్‌కు తీవ్ర గాయాలు కావడంతో జీజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ప్రసాద్ శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మరోవైపు ప్రసాద్ మరణ వార్త విని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడు ప్రసాద్ ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అనుచరుడు. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎంపీపీ హవా నడవగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం నేతలు చక్రం తిప్పుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని ఫిర్యాదులందడంతో కొద్ది రోజులుగా ఇక్కడ పోలీస్ పికెట్ ఉంది. అయినా కూడా వేరేచోట మాటువేసి ప్రసాద్‌ను తీవ్రంగా గాయపర్చడంతో మృతిచెందాడు. ఇటీవల జరిగిన స్కూల్ పేరెంట్ కమిటీ ఎన్నికల్లో ప్రసాద్ కీలకంగా వ్యవహరించాడని తెలుస్తుంది.



ఆమదాలవలస పురపాలక సంఘంలోని అన్ని వార్డుల ప్రధానకాలువల్లో పూడికతీత పనులకు ప్రభుత్వం రూ.29.71 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈమేరకు అన్ని వార్డుల్లోని ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. సీజనల్ వ్యాధులు అరికట్టడానికి కొత్తగా స్ప్రేయింగ్ మిషన్లు 7, ఫాగింగ్ మిషన్లు 2, బ్లీచింగ్ కొనుగోలు చేస్తున్నారు.

– సత్యంన్యూస్, ఆమదాలవలస

## కమిషనర్ బాధ్యతలు స్వీకరణ



ఆమదాలవలస పురపాలక సంఘం కమిషనరుగా పూజారి బాలాజీ ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఏఈ కె.అప్పలనాయుడు, బి.సృజన, టీపీఎస్ హెచ్‌వి సత్యనారాయణ, ఆర్ఐ డి.రామారావు, ఎస్ఐ పి.రామారావు, అకౌంటెంట్ ఐ.సాయిరాం, ఏవీ శ్రీనివాస్, కె.వి.సుబ్రహ్మణ్యం, పద్మనాభం తదితరులు ఘన స్వాగతం పలికారు.

– సత్యంన్యూస్, ఆమదాలవలస

# ఆడవరంలో కృష్ణాష్టమి

(సత్యంన్యూస్, గార)

ఆడవరం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బోగెల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ముందస్తుగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణుడిగా యోధ, జెస్సికా ప్రదర్శించగా రాధికలుగా సుజనా, కేషిని, గగన, చార్మిల్, మేఘన, మనస్వి తదితరులు ప్రదర్శించారు. గోకులకృష్ణ, గోపాలకృష్ణ,, గోపికమ్మ, జైజనార్ధన అనే పాటలకు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో సహాయ ఉపాధ్యాయులు సోనిమి పాపారావు, అంగన్‌వాడి కార్యకర్త జగదీశ్వరి, శ్రీవాణి, కలమ్మ తదితరులు పాల్గొన్నారు.



## శర్వాణిలో ముందస్తు 'శ్రీకృష్ణ జన్మాష్టమి' ఉత్సవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అరసవల్లి రోడ్డులోని శర్వాణి విద్యాలయలో శ్రీకృష్ణ జన్మాష్టమి ముందస్తు వేడుకలు సంస్థ వ్యవస్థాపకులు అంధవరపు సూరిబాబు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక శోభితంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో అనేక మంది బాలబాలికలు గోపికా సహిత శ్రీకృష్ణుని వేషధారణలు, పాటలు, నృత్యాలతో అలరించారు. అనంతరం ఉట్టి ఉత్సవం జరిపి ప్రసాదం అందరూ స్వీకరించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ మహావిష్ణువు అష్టమ అవతారమైన శ్రీకృష్ణుడు భగవద్గీతను అందించి ప్రపంచానికే జగద్గురువు అయ్యారని, భగవద్గీతను అవగాహన చేసుకుంటే మనల్ని మనం సంస్కరించుకోవటమే కాకుండా ప్రపంచానికే దిశా నిర్దేశం చేసే సామర్థ్యం సాధ్యమవుతుందని అన్నారు. హెడ్మిస్ట్రెస్ డాక్టర్ కె.రేఖ మాట్లాడుతూ శ్రీకృష్ణుడు ఒక్క మన భారతదేశానికే కాకుండా ప్రపంచానికే మార్గనిర్దేశం చేసారన్నారు. కార్యక్రమంలో సంస్థ కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.






# కొన్ని నవ్వుల కోసం!

క్యారెక్టర్.. విలన్ పాత్రలతో గొప్ప స్థాయిని అందుకున్న విలక్షణ నటుడు రావు రమేష్ ఇప్పుడు హీరో అయ్యారు. ఆయన లీడ్ రోల్ చేసిన చిత్రం.. మారుతినగర్ సుబ్రహ్మణ్యం. చక్కటి ప్రోమోలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఈ సినిమా ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి.

ఎవరో ఏంటో తెలియకుండా మన అకౌంట్లోకి పది లక్షలు డబ్బులు వేసేస్తే ఎలా ఉంటుంది? అందులోనూ ఏమాత్రం బాధ్యత లేకుండా.. భార్య సంపాదన మీద బతికేస్తున్న ఓ వ్యక్తికి ఇలాంటి అనుభవం ఎదురైతే? ఈ పాయింట్ మీద 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం' సినిమాను సరదాగా నడిపించాలని చూశాడు రైటర్ కమ్ డైరెక్టర్ లక్ష్మణ్ కార్య. ఐతే ఇది రెండున్నర గంటల నిడివితో ఓ కథను నడిపించడానికి సరిపడా బలం ఈ పాయింట్లో లేకపోయింది. దాని చుట్టూ అల్లిన కొన్ని కామెడీ సీన్లు ఓకే అనిపిస్తాయి తప్ప.. కథ మాత్రం మరీ మందగమనంతో సాగడం.. ఆసక్తికర మలుపులేమీ లేకపోవడం నిరాశ కలిగిస్తుంది.

**నటీనటులు:** రావు రమేష్ నటన గురించి చెప్పేదేముంది? చిన్న పాత్ర చేసినా తనదైన ముద్ర వేస్తారు. 'మారుతినగర్ సుబ్రహ్మణ్యం'లో ప్రధాన పాత్రను బాగానే వాడుకున్నారు. కామెడీతో పాటు భావోద్వేగాలనూ బాగా పండించారు. ఆయన ఇప్పటివరకు ఏ సినిమాలో ఇంత అల్లరి చేసి ఉండరు. ఈ క్రమంలో బాగానే నవ్వించగలిగారు. రావు రమేష్ కొడుకు పాత్రలో అంకిత్ కోయ కూడా బాగానే చేశాడు. తన కామెడీ టైమింగ్ బాగుంది. ఇంద్రజ సీరియస్ పాత్రలో ఆకట్టుకుంది. సోషల్ మీడియా పిచ్చి ఉన్న టీనేజ్ అమ్మాయిగా రమ్య పసుపులేటి ఓకే అనిపించింది. హర్షవర్ధన్.. అజయ్.. ప్రవీణ్.. వీళ్లంతా తమ తమ పరిధిలో బాగానే చేశారు. అన్నపూర్ణమ్మ చిన్న పాత్రలో మెరిసింది.

కథ: తిరుపతి దగ్గర మారుతి నగర్ కాలనీకి చెందిన మధ్య తరగతి వ్యక్తి సుబ్రహ్మణ్యం. అతడికి ప్రభుత్వం ఉద్యోగం వచ్చినా కోర్టు కేసు వల్ల పెండింగ్‌లో పడిపోవడంతో.. ఆ ఉద్యోగం తప్ప ఏదీ చేయనంటూ భీష్మించుకుని ఉండిపోతాడు. ఇలాగే పాతికేళ్లు గడిచిపోతాయి. భార్య (ఇంద్రజ) సంపాదన మీదే అతను జీవితాన్ని లాగిస్తుంటాడు. అతడి టీనేజీ కొడుకు విక్రమ్ (అంకిత్ కోయ) కూడా బాధ్యత లేకుండా తండ్రితో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుంటాడు. తాను చేసిన తప్పులకు సుబ్రహ్మణ్యం.. భార్యతో తిట్లు తింటూ వ్యర్థంగా జీవితాన్ని గడిపేస్తున్న సమయంలో తన అకౌంట్లోకి అనుకోకుండా రూ.10 లక్షలు పడతాయి. దీంతో తన జీవితంలో అనూహ్య మలుపులు తిరుగుతుంది. ఈ క్రమంలో సుబ్రహ్మణ్యం జీవితం ఎలా ప్రభావితమైంది.. చివరికి అతడి కథ ఎలా సుఖాంతమైంది అన్నది మిగతా కథ.

**కథనం-విశ్లేషణ:**

'మారుతినగర్ సుబ్రహ్మణ్యం'లో కథానాయకుడైన రావు రమేష్ అకౌంట్లోకి అనుకోకుండా ఓ పది లక్షలు పడిపోతాయి. ఆ సమయంలో వేరే ఊర్లో ఉన్న భార్యకు ఫోన్ చేసి నా అకౌంట్లో డబ్బులేశావా అని అడుగుతాడు. ఆమె అవునంటుంది. అవి కూరగాయలు అమ్మే అమ్మాయికి ఇచ్చేయమంటుంది. ఎందుకని అడిగితే.. నెల నెలా కూరలు కొంటాం కద అంటుంది. దీంతో తండ్రీ కొడుకులు కూరలమ్మే అమ్మాయి ముందు కూర్చుని.. మనం కొనే కూరలకు పది లక్షలవుతుందా అంటూ ఆశ్చర్యపోతారు. అంతే కాక పద బ్యాంకుకి నీ డబ్బులు నీకు తీసిస్తాం అంటాడు రావు రమేష్. అప్పుడామె వెయ్యి రూపాయలకి బ్యాంకుకెందుకు? ఫోన్ పే చేస్తే చాలు అంటుంది. దీనికి అవాక్కవుతాడు రావు రమేష్. పాత్ర పరంగా ఆయనెంత వెర్రిబాగులోడైనా కావచ్చు.. కానీ కూరగాయలకు నెలకు పది లక్షలు ఇచ్చేయడానికి రెడీ అయితే చూసేవాళ్లకు అదెంత వెటకారంగా అనిపిస్తుంది. ఇలాంటి సీన్లను కామెడీ అనుకుని ఎలా నవ్వుకోగలం? ఇదొక్కటే కాదు.. 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం' సినిమాలో ఎటకరాంగా.. ఇల్లాజికల్‌గా అనిపించే సీన్లు చాలానే ఉన్నాయి. రావు రమేష్ చేయడం వల్ల సుబ్రహ్మణ్యం పాత్ర కొంచెం పండింది. అక్కడక్కడా కొన్ని నవ్వులూ పండాయి. కానీ షార్ట్ స్టోరీలా అనిపించే ఈ కథను విపరీతంగా సాగదీయడం.. ఇల్లాజికల్ సీన్ల వల్ల 'మారుతినగర్ సుబ్ర హ్మణ్యం' ఒక సగటు సినిమా స్థాయిని మించలేకపోయింది. కామెడీ టచ్ ఉన్న క్యారెక్టర్ రోల్స్ చేయడంలో తలపండిన రావు రమేష్.. సినిమా మొత్తాన్ని నడిపించే అలాంటి పాత్ర ఒకటి తగలడంతో తనవంతుగా ఈ చిత్రాన్ని నిలబెట్టడానికి బాగానే కష్టపడ్డాడు. సన్నివేశాలు చాలావరకు సాధారణంగానే రాసుకున్నా.. రావు రమేష్ పండించిన వినోదం వల్లే అవి కొంత మెరుగుపడ్డాయి. ఐతే కొన్ని సీన్లు మరీ ఇల్లాజికల్‌గా సాగడం మాత్రం ప్రేక్షకులను చికాకు పెడుతుంది. పైన చెప్పుకున్న కూరలమ్మాయి సీన్ అందులో ఒకటి. ఇదే విడ్డూరం అంటే.. షాపుల్లోకి వెళ్లి వస్తువులన్నీ కొనేసిన తండ్రీ కొడుకులు మళ్లీ వాళ్లకే తిరిగి ఇచ్చేస్తాం డబ్బులు వెనక్కి ఇవ్వండి అనడం ఇంకా విచిత్రం. ఒకసారి ఓ వ్యక్తి చేతిలో మోసపోయాక కూడా ఇంకోసారి మరో వ్యక్తికి డబ్బులు ఇచ్చి ఎగనామం పెట్టించుకోవడం ఇంకో విడ్డూరం.

ఏ లాజిక్కులూ లేకుండా నడిచిపోయే 'జాతిరత్నాలు' తరహా కామెడీ అంటే ఓకే కానీ.. ఒక మధ్య తరగతి కుటుంబం.. అందులో బాధలు–బాధ్యతలు అంటూ ఒక సెటప్ చూపించాక తెర మీద పాత్రలు మరీ బాధ్యతారాహిత్యంగా ఉంటూ అల్లరి చేస్తే కామెడీని ఎంజాయ్ చేయడం కష్టం. 'మారుతినగర్ సుబ్రహ్మణ్యం'తో ఇదే సమస్య. ఫ్యాక్షన్ సినిమాల్లో విపరీతమైన రక్తపాతం చూపించి చివర్లో శాంతి వచనాలు పలికినట్లు.. ఇందులో కూడా హీరో పాత్రను చాలా బాధ్యతారాహిత్యంగా చూపించి.. చివర్లో ఆ పాత్ర పరివర్తన మాటలు చెప్పిస్తారు. కానీ అవేమంత ఎమోషనల్‌గా అనిపించవు. సినిమా ఆరంభంలో కొంచెం హుషారుగా అనిపించినా.. 10 లక్షల డబ్బుల చుట్టూ డ్రామాను విపరీతంగా సాగదీయడం వల్ల రాను రాను ఆసక్తి సన్నగిల్లిపోతుంది. ఈ పది లక్షలు అకౌంట్లో పడడం వెనుక చివర్లో చూపిం చిన ట్విస్ట్ కొసమెరుపులా అనిపిస్తుంది. ముగింపు సన్నివేశాలు పర్వాలేదనిపిస్తాయి. కానీ ఓవరాల్‌గా 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం' అనుకున్నంత ఇంపాక్ట్ మాత్రం వేయలేకపోయింది. రావు రమేష్ నటనను ఇష్టపడేవాళ్లు ఆయన్ని ఫుల్‌లెంగ్త్ రోల్‌లో చూడడానికి.. కొన్ని కామెడీ సీన్ల కోసం ఈ చిత్రంపై ఓ లుక్కేయొచ్చు.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...

**సాంకేతిక వర్గం:** టెక్నికల్ గా 'మారుతినగర్ సుబ్రహ్మణ్యం' ఓ మోస్తరుగా అనిపిస్తుంది. బిట్ సాంగ్స్ తప్ప ఫుల్ లెంగ్త్ పాటలు లేని ఈ సినిమాలో కళ్యాణ్ నాయక్ సంగీతం పర్వాలేదు. తన నేపథ్య సంగీతం యాప్ట్ అనిపిస్తుంది. బాల్ రెడ్డి ఛాయాగ్రహణం సినిమా నడతకు తగ్గట్లుగా సాగింది. నిర్మాణ విలువలు ఓకే. ఇంతకుముందు 'హ్యాపీ వెడ్డింగ్' సీరియస్ లవ్ స్టోరీ తీసిన లక్ష్మణ్ కార్య.. ఈసారి కామెడీ టచ్ ఉన్న కథను ఎంచుకున్నాడు. రావు రమేష్ లాంటి నటుడిని పెట్టి ఓ మధ్య తరగతి కథను చెప్పాలన్న ఆలోచన బాగుంది. కానీ అతను మరీ తక్కువ పరిధి ఉన్న కథను ఎంచుకున్నాడు. రెండున్నర గంటల పాటు కథా విస్తరణ చేయదగ్గ బలమైన పాయింట్ ఇందులో లేకపోయింది. కామెడీని బాగానే డీల్ చేయగలిగాడు కానీ.. ఆసక్తికర కథనం రాసుకోకపోవడంతో లక్ష్మణ్ కార్య అనుకున్న స్థాయిలో మెరుపులు మెరిపించలేకపోయాడు.

# అందరి చూపూ ఇప్పుడటే..!




- హర్యానా, జమ్ము-కశ్మీర్‌లలో ఎన్నికల నగారా మోగించిన ఎన్నికల కమిషన్
- పదేళ్ల తర్వాత జమ్ము-కశ్మీర్‌లో ఎన్నికలు
- నేడో రేపో మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూల్



– దుప్పల రవికుమార్

గురువారం జాతీయ ఎన్నికల కమిషన్ జమ్ము కశ్మీర్‌తో పాటు హర్యానా రాష్ట్ర శాసనసభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. పార్లమెంటు ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జరగ బోతున్న మొదటి ఎన్నికలు కావడంతో అందరిలో గొప్ప ఉత్కంఠ నెలకొంది. ఈ ఏడాది హర్యానాతో పాటు మహారాష్ట్రలో కూడా ఎన్నికలు జరగవలసి ఉంది. మహారాష్ట్ర ఎన్నికల నోటిఫికేషన్ ఇంకా వెలువరించాల్సి ఉంది. మధ్యలో జమ్ము కశ్మీర్ చేరింది. ఈ రాష్ట్రం విషయం చాలా ప్రత్యేకం, సున్నితం. భారతీయ జనతా పార్టీ చాలా మొండిగా ఈ రాష్ట్రంతో వ్యవహరించింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాజ్యాంగంలో ప్రత్యేకంగా పొందిపరచిన 370వ అధికరణాన్ని రద్దు చేసింది. ఈ ఆర్టికల్ ద్వారా కశ్మీరంలో కొనసాగుతున్న ప్రత్యేక ప్రతిపత్తి హోదాను తొలగించి, రాష్ట్రపతి పాలన విధించింది. దీనికి అయిదేళ్లు పూర్తి కావస్తుండడంతో సుప్రీంకోర్టు సెప్టెంబరు నెలాఖరుకల్లా ఎన్నికలు జరపమని కేంద్రానికి గట్టిగా చెప్పడంతో ప్రజాస్వామ్యయుత పాలన కోసం కసరత్తు మొదలుపెట్టారు. జాతీయ ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం జమ్ము కశ్మీర్‌లో మూడు దశలలో (సెప్టెంబర్ 18, 25, అక్టోబరు 1) ఎన్నికలు జరుగుతాయి. హర్యానాలో మాత్రం అక్టోబర్ ఒకటో తేదీన ఎన్నికలు ముగుస్తాయి.

హర్యానాలో జరగబోయే శాసనసభ ఎన్నికలు ఎన్డీయే, ఇండియా బ్లాక్‌ల మధ్య జరుగుతోన్న రసవత్తరమైన పోరును మరింత స్పష్టంగా దేశప్రజలకు విశదపరుస్తుంది. లోక్‌సభలో సమ ఉజ్జీలుగా ఉన్న ఎన్డీయే, ఇండియా బ్లాక్‌ల మధ్య అసలు సిసలు పోరుకు ఈ ఎన్నికలు ఒక తెరంగేట్రంలా పనికొస్తాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నేడో రేపో మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూల్ కూడా విడుదల కానుంది. చాలా చిత్రంగా హర్యానా, మహారాష్ట్రలు బీజేపీ పాలిత ప్రాంతాలే కావడం మరో విశేషం. అయినప్పటికీ మొన్నటి పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో రెండుచోట్లా భారతీయ జనతా పార్టీ బొక్కబోర్లా పడింది. హర్యానాలో పది లోక్‌సభ స్థానాలకు గాను 2019లో పది స్థానాలు కైవసం చేసుకున్న బీజేపీ, 2024లో కేవలం ఐదు స్థానాలే గెలవగలిగింది. మిగిలిన ఐదు స్థానాలు కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది. అంటే హర్యానాలో కాంగ్రెస్ బలం పుంజుకుందనే చెప్పాలి. అదేవిధంగా 48 పార్లమెంటు స్థానాలున్న మహారాష్ట్రలో 2019లో ఎన్డీయే 43 స్థానాలు గెలవగా, యుపిఏ కేవలం 5 స్థానాలకే పరిమితమైంది. 2024 ఎన్నికలలో ఎన్డీయే భాగస్వామి అయిన అధికార పక్షం మహాయుతి కేవలం 17 ఎంపీ స్థానాలు గెలవగా, ప్రతిపక్ష మహా వికాస్ అఘాది 30 సీట్లు కైవసం చేసుకుంది. కాగా శాసనసభ విషయానికొస్తే మహారాష్ట్రలో 288 స్థానాలుండగా, హర్యానాలో 90 స్థానాలున్నాయి. హర్యానాలో గత పదేళ్లుగా బీజేపీ అధికారంలో ఉంది. అందుకని అక్కడ ప్రభుత్వ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని ముందే పసిగట్టిన అధికార పక్షం తగిన జాగ్రత్తలు తీసుకుంది.



## పెరుగుతున్న ప్రజా వ్యతిరేకత

అందులో మొదటి అడుగుగా దీర్ఘకాలం ముఖ్యమంత్రిగా ఉన్న మనోహర్ లాల్ ఖట్టర్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించారు. అయితే ఆయనెక్కడ అలుగుతాడోనని తిన్నగా దేశ రాజధానికి తీసుకుని వెళ్లి కేంద్రమంత్రి పదవి ఇచ్చి కూర్చోబెట్టారు. ఆయన స్థానంలో వెనుకబడిన తరగతులకు చెందిన నయాబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రి పీఠం అధిష్టింపజేశారు. అది కూడా ఐదు నెలల కిందట. పాలనలో తన మార్కు చూపించుకోవడానికి ఆయన విశ్వప్రయత్నం చేస్తున్నారు. వివాదాలకు దూరంగా ఉండే సైనీ ఖట్టర్ అనుచరుడిగా, కంప్యూటర్ ఆపరేటర్‌గా బీజేపీ పార్టీ ఆఫీసులో 1996లో చేరారు. నెమ్మదిగా ఒక్కో మెట్టు ఎక్కి, 2005లో యువమోర్చా అంబాలా జిల్లా అధ్యక్షుడిగా, 2012కల్లా హర్యానా కిసాన్ మోర్చా రాష్ట్ర బాధ్యతలు చేపట్టి, 2014లో నారాయణ్‌ఘర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా కూడా అవకాశం దక్కించుకున్నారు. 2019 ఎన్నికల్లో కురుక్షేత్ర నుంచి ఎంపీగా గెలిచారు. ముఖ్యమంత్రి కాకముందు హర్యానా బీజేపీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. జాట్ ఓటర్లను ఊరించడం మానేసి జాటేతర ఓటర్లను ఆకర్షించే విధంగా పలు రకాల పథకాలను ఇప్పటికే ప్రారంభించిన సైనీ ఎన్నికల ప్రచారంలో ఒకడుగు ముందే ఉన్నారని చెప్పాలి.

వీరికి ధీటుగా కాంగ్రెస్‌పార్టీ కలిసివచ్చే పార్టీలను కలుపుకొని రావాలని విఫల యత్నం చేస్తోంది. ఒకవైపు వివిధ నియోజకవర్గాలలో బీజేపీ వ్యతిరేక ఎజెండాను స్పష్టంగా ముందుకుపెట్టి, ప్రభుత్వ వ్యతిరేకతను తమ ఓటుబ్యాంకుగా మలుచుకోవాలని ప్రయత్నం చేస్తోంది. అయితే చాలా ఇతర రాష్ట్రాల మాదిరిగానే హర్యానాలో కూడా కాంగ్రెస్ పార్టీ అంతర్గత పోరు కొంత మైనస్‌గా మారొచ్చని రాజకీయ విశ్లేషకుల అంచనా. ఎన్నికల ఫలితాల్లో ఈసారి తమకు సానుకూలంగా ఉంటుందని కాంగ్రెస్ అత్యంత ఆత్మస్థైర్యాన్ని మాత్రం ప్రదర్శిస్తోంది. ఈ రెండు ముఖ్యమైన పార్టీలకు ధీటుగా ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) కూడా చాలా దూకుడుగా హర్యానాలో 90 స్థానాల్లోనూ ఒంటరిగా పోటీ చేయడానికి ఉద్యుక్తమవుతోంది. గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకుని ఒక శాసనసభ్యుని గెల్చుకుంది. హర్యానాకు రెండు పొరుగు రాష్ట్రాలుగా ఉన్న పంజాబ్, ఢిల్లీల్లో ఆప్ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి, ఆప్ పార్టీ పాలనను హర్యానా ప్రజలు కూడా ఆకాంక్షిస్తున్నారని ఆప్ పార్టీకి చెందిన పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ గురువారం హర్యానాలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ప్రకటించారు. పైగా హర్యానా ఇదివరకు కాంగ్రెస్ పార్టీకి, ఇప్పుడు బీజేపీకి అధికారమిచ్చినా ఎలాంటి ప్రయోజనం లేకపోయిందని, ఇప్పుడు ఆప్‌కు అవకాశం ఇచ్చి చూడాలని ప్రజలను కోరారు. ఆ విధంగా స్పష్టమైన త్రిముఖ పోటీ హర్యానాలో నెలకొని ఉన్నట్టు మనం భావించవచ్చు.

## త్రిముఖ పోరు తప్పదిక!

అక్టోబరు 1న ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎలక్షన్ కమిషన్ ప్రకటన వెలువడగానే ముందుగా భారతీయ జనతా పార్టీ ఎన్నికల శంఖారావం మోగించింది. తమ వివిధ దళాల పదాధికారులతో గురువారమే గురుగ్రామ్‌లో సన్నాహక సమావేశం ఏర్పాటుచేసింది. నియోజకవర్గాల వారీ బాధ్యతలను ప్రకటించింది. బీజేపీ హర్యానా శాసనసభ ఎన్నికల ఇన్‌ఛార్జి ధర్మేంద్ర ప్రధాన్, మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, ఎన్నికల సహ ఇన్‌ఛార్జి విప్లవ్‌కుమార్ దేవ్ తదితరులు తమ సన్నాహాలు ప్రారంభించారు. దీనికి ధీటుగా కాంగ్రెస్ పార్టీ వారం పది రోజుల్లో నియోజకవర్గాల వారీ తమ అభ్యర్థుల పేర్లను ప్రకటించనున్నట్టు తెలిపింది. 2019 ఎన్నికల నాటికే బాగ్రి, జాట్‌లాండ్ ప్రాంతాలలో బీజేపీ ప్రాబల్యాన్ని గణనీయంగా తగ్గించి కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యాన్ని స్థాపించగలిగింది. పార్లమెంటు ఎన్నికల్లో సుమారు 68 నియోజక వర్గాలలో కాంగ్రెస్ స్పష్టమైన మెజారిటీ సంపాదించింది. ఇది కూడా కాంగ్రెస్ పార్టీ ఆత్మవిశ్వాసాన్ని పెంచేదే. నారాయణ్‌ఘర్, కాల్కా నియోజకవర్గాలలో కాంగ్రెస్ పట్టును కోల్పోగా, ఫిరోజ్‌పూర్ జిర్కా, నూహ్, ఆహిర్‌వాల్, బ్రజ్, జాట్‌లాండ్ నియోజక వర్గాల్లో తిరుగులేని ప్రాబల్యాన్ని పొందింది. ఏదేమైనా కాంగ్రెస్ విజయావకాశాలను బాగ్రి, జాట్‌లాండ్ లాంటి నియోజక వర్గాలు తేలుస్తాయని చాలామంది విశ్వసిస్తున్నారు.

---




# ఓ టెకీ 30లక్షల ప్యాకేజీ వెనుక ట్రైన్ జర్నీ కథ!

**కొన్ని రియల్ స్టోరీస్ హృదయాన్ని హత్తుకుంటాయి. మరికొన్ని ఇంతేనా అనిపిస్తాయి. ఒకరికి బాగా నచ్చినవి ఇంకొందరికి మామూలుగా అనిపించొచ్చు. కానీ, నిజ జీవిత అనుభవాలకు ఏదో ఓ రకమైన స్పందనలైతే కనిపిస్తాయి. అలా సోషల్ మీడియాలో సాఫ్ట్‌వేర్ టెకీ షేర్ చేసిన తన రియల్ స్టోరీ ఇప్పుడో హాట్ టాపిక్‌గా మారి.. ఆ పోస్ట్ కింద చాలామంది తమ వ్యక్తిగత కథలు చెబుతుండటం 'ఎక్స్'లో కనిపించింది.**

సాధారణంగా ఆర్థికంగా కాస్త మంచి స్థితిలో ఉన్నవాళ్లు రైలు ప్రయాణాల కంటే ఫ్లైట్స్‌లో వెళ్లి రావడానికే ఎక్కువగా ఇష్టపడుతుంటారు. ఇంకా దూరాభారాలెక్కువైతే విమానమే బెటర్ అనే ఆప్షన్‌లో ఉంటారు. అయితే, విమాన ప్రయాణాలు సమయాన్ని బట్టి, రద్దీని బట్టి, అకేషన్స్ బట్టి ధరలు హెచ్చుతగ్గులున్నప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో ట్రైన్స్‌ను ఆశ్రయిస్తుంటారు. కానీ, కొందరు మాత్రం రైలు ప్రయాణాలే ఎక్కువ ఇష్టపడతారు. దాన్నో మజాగా స్వీకరిస్తారు. సరదాగా మధ్యమధ్యలో వచ్చే స్టేషన్స్, కాస్సేపు సేద దీరేందుకు బెర్త్, బోర్‌కొడితే ఏ పుస్తకమో చదువుతూ కింద కూర్చునే సీటింగ్ సౌకర్యం, వీటికి తోడు ఎక్కడెక్కడివారో రైలు ప్రయాణంలో తమ జీవితానుభవాలను పంచుకుంటూ దగ్గరవుతుండటం.. అలా మొత్తంగా ట్రైన్ జర్నీ జీవితంలో సరదా అనుభూతి.

అయితే, ఓ సాఫ్ట్‌వేర్ టెకీకి మాత్రం రైలు జర్నీ ఇప్పుడు ఓ మధురానుభూతి. అంతేకాదు, అక్కడే ఎన్నో నేర్చుకోగలమనే భావన. అక్కడే ఇంకేదో దొరుకుతుందేమోనన్న ఆశ. తనలాంటివారికీ తానూ ఇంత సాయపడొచ్చేమోనన్న ఆలోచన. వెరసి.. చిరాగ్ దేశ్ ముఖ్ అనే టెకీ స్టోరీ ఇప్పుడు వైరల్‌గా మారింది. తానెందుకు విమానాల్లో ప్రయాణాన్ని అవాయిడ్ చేస్తాడు, మరెందుకు రైళ్లల్లోనే ప్రయాణిస్తాడో ఓ ఫన్నీ స్టోరీని చిరాగ్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశాడు.

తను రైల్లో ప్రయాణిస్తున్నప్పుడు తనకు ఓ సాఫ్ట్‌వేర్ టెకీ కలిశాడట. అతడితో మాటా మాటా కలిసి ఆ ప్రయాణంలో చిరాగ్‌కు అతడితో ఓ స్నేహబంధం బలపడింది. మీరు సాఫ్ట్‌వేర్ జాబ్‌లో ఏడాదికి 30 లక్షల ప్యాకేజీ కలిగి ఉన్నారు. ఆర్థికంగా బాగున్న మీరు అప్పుడో ఇప్పుడో ప్రయాణాలు చేసేటప్పుడు హాయిగా విమానంలో గంట, రెండు గంటల్లో వెళ్లిపోవచ్చు కదా? అన్నది చిరాగ్ ప్రశ్న.

చదువు పూర్తయి ఇబ్బందులు పడుతున్న క్రమంలో తనకు రైలు ప్రయాణమే ఉద్యోగాన్నిచ్చిందన్నది చిరాగ్‌కు రైల్లో పరిచయమైన సాఫ్ట్ వేర్ టెకీ సమాధానం. రైల్లో ప్రయాణిస్తున్నప్పుడు మనలాగే ఓ అపరిచిత వ్యక్తితో ఏర్పడిన స్నేహం.. తన సాఫ్ట్‌వేర్ మొదటి జాబ్‌కు రిఫరెన్స్‌గా పని చేసిందని చెప్పాడతను. అలా తాను ఇంతింతై ఎదిగి ఇవాళ 30 లక్షల ప్యాకేజీతో బాగానే ఉన్నాను. కానీ, నాకు ఉద్యోగం పరిచయమైన మిత్రుడు.

ఎప్పుడైనా అత్యవర పరిస్థితి ఏర్పడినప్పుడు మాత్రమే ఫ్లైట్ తప్ప.. మిగిలిన సమయాల్లో కచ్చితంగా ట్రైన్ తన ఫస్ట్ ఆప్షన్ అని చెప్పాడనే స్టోరీని చిరాగ్ 'ఎక్స్'లో పోస్ట్ చేయడంతో ఈ స్టోరీ ఇప్పుడు ట్రెండింగ్‌గా మారింది.

చిరాగ్ పోస్ట్ వృత్తాంతంతో చాలామంది రకరకాల వారి అనుభవాలను స్టోరీస్‌గా చెప్పుకొచ్చారు. తన మొదటి ఇంటర్న్ షిప్ తర్వాత ఏకంగా తన కుటుంబ సభ్యుడిలా మారిన ఓ వ్యక్తి అంతకుముందు తనకు రైల్లోనే పరిచయమయ్యాడని, తన పక్కన కూర్చున్నాడని ప్రఖర్ అనే వ్యక్తి షేర్ చేశాడు. రైలులో చేసే సుదీర్ఘ ప్రయాణాల్లో ఎన్నో కొత్త విషయాలు రావడానికి కారణమైన రైలు ప్రయాణం ఓ అనుభూతినిస్తుంది. ఇంకేదైనా జరుగొచ్చనే ఆశను కల్పిస్తుంది. నాలాంటివారికి ఏదైనా చేసే అవకాశాన్ని కల్పించొచ్చేమోనన్న ఆలోచనా మదిలో మెదులుతుంటుంది. మొత్తంగా రైలు ప్రయాణంలో జరిగే పరిచయాలు, చర్చలు.. జీవన ప్రయాణంలో కూడా ఎక్కడో ఓ చోట ఉపయోగపడుతుండటంతో రైలుతో ఉన్న అనుబంధాన్ని కాదనుకోలేక ట్రైన్ జర్నీస్‌నే తానెక్కువ ఇష్టపడుతున్నట్టు చెప్పాడట చిరాగ్‌కు తెలుస్తాయని, అలా 2105లో తాను ట్రైన్ జర్నీ చేస్తున్నప్పుడు క్లౌడ్ టెక్నాలజీ ప్రాముఖ్యతను ఓ వ్యక్తి ద్వారా తెలుసుకున్నానని, ఆ టెకీ సూచనలు, సలహాలతో ఇప్పుడు అమెజాన్ వెబ్ సర్వీసెస్‌లో తాను పని చేస్తున్నట్టు సౌరవ్ అనే మరో టెకీ చెప్పుకొచ్చారు.

అయితే, 'ఎక్స్' ద్వారా చిరాగ్ దేశ్‌ముఖ్ రియల్ స్టోరీ అంటూ చెప్పిన ఈ కథపై పలువురు సందేహాలను, కౌంటర్ మెస్సేజెస్‌ను పోస్ట్ చేసినప్పటికీ మొత్తంగా సోషల్ మీడియా ట్రెండింగ్ టాపిక్‌గా వార్తల్లోకెక్కింది.

– రమణ కొంటికర్ల




ఎం.ఇమ్రాన్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SriAaKaSa
YOUR TRUSTED PARTNER IN THE DISTANCE EDUCATION SECTOR.
Join our Earn while Learn program and get a job within 40 days after joining.
LAST DATE: AUGUST-28
91330 06999 Courses 92466 36411
10th, Intermediate
BA (all groups), B.Com, BLiSc, B.SC (all groups),
BBA, BCA (with Market trending specialisations)
MA (all subjects), M. Com, MBA, MCA,
M. SC (All Subjects), MLiSc, M.Tech
Computer Applications, Cyber Security. Digital Marketing.
Hospital Management, Tourism Management

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

జై శ్రీమన్నారాయణ
శ్రీ క్రిష్ణ ఆన్‌లైన్ సర్వీసెస్
మావద్ద అన్ని రకముల జాబ్ అప్లికేషన్స్ ఆన్‌లైన్ చేయబడును.
సెల్: 93938 41308
రైల్వే రిజర్వేషన్లు, బస్ రిజర్వేషన్ సదుపాయం కలదు.

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE WOMEN'S COLLEGE ROAD, SRIKAKULAM - 532 001

# విరివిగా మొక్కలు నాటాలి

## బీఆర్‌ఏయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య రజని

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రతిఒక్కరు పెద్దఎత్తున మొక్కలు నాటాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజని సూచించారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ క్షేత్ర ప్రచార శాఖ(శ్రీకాకుళం)తో కలిసి డాక్టర్ బీఆర్‌ఏయూలో శనివారం 'ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కళాశాల పరిసరాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటరీలను ఉద్దేశించి వీసీ మాట్లాడారు. కాలుష్యం అధికం అవుతుండటం, దీని ప్రభావంతో అనారోగ్య సమాజం ఏర్పడుతుందన్నారు. పుట్టిన రోజులు, ప్రత్యేక సందర్భాల్లో ఏక్ పేడ్ మాకే నామ్‌లో భాగంగా మొక్కలు విరివిగా నాటడం అలవాటు చేసుకోవాలన్నారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ శ్రీకాకుళం జిల్లా అధికారి బి.తారకప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనల్లో భాగంగా దేశమంతా పెద్ద ఎత్తున తల్లిపేరిట మొక్క నాటడం కార్యక్రమంలో పాల్గొంటున్నారని, దీనిలో ఆంధ్రప్రదేశ్ మరింత ముందుంజలో ఉండాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్‌ఏయూ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ఆచార్య సి.సుజాత, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.అనురాధ, జర్నలిజం విభాగం అధ్యాపకులు డాక్టర్ ఆర్.తిరుపతిరావు, డాక్టర్ జి.లీలావరప్రసాదరావు, డాక్టర్ వై.డి. రామదాస్, పీడీ డాక్టర్ ఎం.శ్రీనివాసు, అధ్యాపకులు ఎం.రామారావు, టి.భవాని తదితరులు పాల్గొన్నారు.




వక్ఫ్ చట్టంలో మార్పులుగా 40 సవరణల బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నేపథ్యంలో స్థానిక జామియా మసీదులో అఖిల పక్షాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా నలుమూలల నుండి ప్రముఖులు పాల్గొని ఈ బిల్లును వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో మహిబుల్లా ఖాన్, షాను అదినీ, పిసిని చంద్రమోహన్, వీజీకే మూర్తి, ఎంఏ బేగ్, పొన్నాడ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం.




# రైతులకు సాగునీరు ఇవ్వాలి

(సత్యంన్యూస్, మందస)

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కళింగదళ్, దబార్సింగ్, గోపాలసాగరం, దామోదరసాగరం రిజర్వాయర్లను ఆధునీకరించి రైతులకు సాగునీరు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శి వర్గ సభ్యులు కె.మోహనరావులు డిమాండ్ చేశారు. మందస సీపీఎం సమావేశం అనంతరం ప్రాజెక్టులు పరిశీలనకు ప్రతినిధి బృందం వెళ్ళింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళింగదళ్ రిజర్వాయర్ ఆయకట్టు 7000 ఎకరాలు, డాబార్‌సింగ్ 1000 ఎకరాలు, దామోదర్‌సాగర్ రిజర్వాయర్ 2000 ఎకరాలకు సాగునీరు ఇవ్వవలసి ఉండగా మధుములు పాడైపోయి, కాలువలు తవ్వక, షట్టర్లు నాసిరకం కావడం వలన పాడైపోవడంతో నీరు వృధాగా సముద్రంలో కలిసిపోతుందన్నారు. చీపిగడ్డ నుండి వృధాగా పోతున్న నీటిని గోపాలసాగరంకు మళ్లించడం ద్వారా పది గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి ఎకరాలకు నీరు అందించవచ్చున్నారు. డాబార్సింగ్ రిజర్వాయర్‌లో వర్షాకాలంలో కూడ చుక్కనీరులేదని, ప్రాజెక్ట్ డిజైనింగ్ లోపమే రైతులకు శాపంగా మారిందన్నారు. టీడీపీ, వైకాపా ప్రభుత్వాలు నిధులు కేటాయించకపోవడం వలనే మహేంద్ర గిరుల నుంచి వచ్చిన నీరు వృధాగా సముద్రం పాలవుతుందని విమర్శించారు. శ్రీకాకుళం జిల్లా వెనుకబడిన జిల్లా కాబట్టి పాలకుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతాంగానికి తీవ్రనష్టం వాటిల్లుతుందని వారు విమర్శించారు. నదీ జలాల్ని ఉపయోగించుకోవడంలో పాలకులు వైఫల్యం చెందారన్నారు. ప్రాజెక్టులు కట్టి నాలుగు దశాబ్దాలు కావస్తున్న కాలువలు తవ్వడం పూర్తికాలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జీడి రైతు సంఘం జిల్లా కన్వనర్ తెప్పల అజయ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సంగారు లక్ష్మీనారాయణ, కె.కేశవరావు, అర్.ఏకాశి, యన్.లచ్చయ్య,పి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# చరిత్రలో మాయని మచ్చ.. అజ్మీర్ కీచకపర్వం

(మొదటిపేజీ తరువాయి)

అబ్బాయి మధ్య ప్రేమ వ్యవహారం. దీన్నే ఫొటోలు తీసి చిష్తీ బృందం వందల కుటుంబాలను నాశనం చేసింది.

**స్థానిక మీడియా సృష్టించిన సంచలనం**

ఏప్రిల్ 1992లో నిద్రమత్తులో ఉన్న ఉదయం, అజ్మీర్‌లోని స్థానిక వార్తాపత్రిక అయిన దైనిక్ నవజ్యోతి సంపాదకుడు దీనబంధు చౌదరి ప్రచురించిన నివేదికతో అజ్మీర్ నగరం మేల్కొంది. ఈ నివేదిక మోసం, దోపిడీ వ్యవస్థను బట్టబయలు చేసింది. చౌదరి కథనం ప్రకారం, ఈ కుంభకోణం గురించి కథ బయటపడడానికి ఒక సంవత్సరం ముందే తెలిసినప్పటికీ, స్థానిక లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దర్యాప్తును నిలిపివేశారు. నిందితులు ప్రసిద్ధ దర్గాకు చెందిన ఇన్‌ఫ్లియెన్స్ ఉన్న వ్యక్తులు. ధర్మకర్త కుటుంబాల నుంచి వచ్చారని, చట్టపరమైన చర్యలు మతాల మధ్య ఉద్రిక్తతకు దారితీస్తాయని పేర్కొంటూ స్థానిక రాజకీయ నాయకులు చట్టపరమైన చర్యలను ఆపడానికి ప్రయత్నించారని ఆయన ఉటంకించారు. వాస్తవానికి ఫొటోలతో కూడిన ఈ కథనం ప్రచురించడానికి పత్రికలకు అనేక అడ్డంకులు ఉన్నాయి. కానీ ఇది దేశ చరిత్రలో మాయని మచ్చకావడంతో నవజ్యోతి పత్రిక తెగించి ప్రచురించింది. ఎందుకంటే.. పరిపాలన, పోలీసులను నిద్ర నుంచి బయటకు తీసుకురావడానికి ఇది ఏకైక మార్గం. కథనం ప్రచురించబడిన వెంటనే, ఈ సంఘటన పట్టణమంతటా షాక్‌వేవ్‌లను పంపింది. కోపంగా ఉన్న ప్రజలు మూడు రోజుల బంద్ సందర్భంగా బహిరంగ ప్రదర్శనలు నిర్వహించారు. ప్రజల ఒత్తిడి కారణంగా చర్య తీసుకోవలసి వచ్చిన తర్వాత, బీజేపీ ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. చివరకు పోలీసులు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఎనిమిది మంది నిందితులపై అభియోగాలు మోపారు. దర్యాప్తు మొత్తం 18 మందిని అరెస్టు చేయడానికి దారితీసింది. నిందితుల సామాజిక వర్గం కారణంగా చాలామంది బాధితులు ముందుకు రాలేదు. చాలామంది బాధితులు, యువకులు, బలహీనులు, అప్పటికే తమ ప్రాణాలను తీసుకున్నారు.

**ట్రయల్.. శిక్ష**

చాలామంది బాధితులు ముందుకు రాకపోవడంతో కేవలం 30 మంది మాత్రమే విచారణకు ముందుకు వచ్చారు. వీరిలో 12 మందే కోర్టు వరకు వచ్చారు. కేసును చివరకు వచ్చేసరికి బాధితులు ఇద్దరు మాత్రమే మిగిలారు. మొత్తం 18 మంది నిందితులపై భారత శిక్షా స్మృతి కింద కిడ్నాప్, సామూహిక అత్యాచారం, ఉమెన్ అసాల్టేషన్ కింద అభియోగాలు రుజువయ్యాయి. కానీ ప్రధాన నిందితుడు ఫరూఖ్ చిష్తీ తన విచారణ సమయంలో మెంటల్‌గా ప్రూవ్ చేసుకున్నాడు. ముగ్గురు నిందితులు జైలులో ఆత్మహత్య చేసుకున్నారు. సలీమ్ నఫీస్ అనే మరో నిందితుడిని 2012లో పోలీసులు అరెస్టు చేశారు. దోషులు సుప్రీంకోర్టుకు వెళ్లినా ఎదురుదెబ్బే తగిలింది. పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు పాటు మరికొందరు నిందితులకు పోక్సో కోర్టు జీవిత కాల జైలు శిక్ష విధించింది. జరిమానా సరేసరి.

# పేషెంట్లపై ఆర్థిక భారం వేస్తే కఠిన చర్యలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ కింద వైద్యం తీసుకొనే పెషెంట్లపై ఆర్థిక భారం వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలను హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవకు సంబంధించి పేషెంట్ల నుండి ఏ విధమైన నగదు వసూలు చేయకుండా వైద్యం చేయడంపై కార్పొరేట్ ఆసుపత్రులతో శనివారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేషెంట్లపై ఆర్థికభారం వేయకుండా నాణ్యమైన, మెరుగైన వైద్యం అందించాలన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఆసుపత్రుల్లో చేరే పేషెంట్లకు నాణ్యమైన, మెరుగైన వైద్యం అందించే బాధ్యత ఆరోగ్యమిత్ర వహించాలన్నారు. పేషెంట్స్ ఎవరైనా ఫిర్యాదు చేస్తే సమావేశం రోజున సమావేశానికి ఫిర్యాదు చేసే పేషెంట్లను కూడా పిలవాలని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కో ఆర్డినేటర్ ను ఆదేశించారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో–ఆర్డినేటర్ ప్రకాశరావు మాట్లాడుతూ ఆసుపత్రుల్లో పేషెంట్లకు వైద్య పరీక్షలు చేసే చార్జీలు డిసిప్లే చేయాలన్నారు. సెకండరీ పరీక్షలకు పేషెంట్ల నుండి నగదు వసూలు చేయరాదని చెప్పారు. ఫైర్, బయోమెడికల్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్‌లపై కలెక్టర్ ఆరా తీయగా రెయిన్బోకి ఇస్తున్నట్లు ప్రకాశరావు తెలిపారు. పేషెంట్లు ఆసుపత్రులకు వైద్యం నిమిత్తం వస్తే అక్కడ ఆ వైద్యం లేకపోతే ఎక్కడైతే ట్రీట్‌మెంట్ ఇస్తారో ఆ ఆసుపత్రుల పేర్లు ఖచ్చితంగా తెలిపాలన్నారు. భోజనం మెనూలో పాలు, పళ్లు ఉన్నట్లు చూడాలని చెప్పారు. 108 సర్వీసులను పక్కాగా వినియోగించాలని వివరించారు. వివిధ ఆసుపత్రులపై ఫిర్యాదులు గూర్చి ఆయన అడుగగా ఫిర్యాదులపై కో ఆర్డినేటర్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఓ రాజ్యలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీకాంత్, కార్పొరేట్ ఆసుపత్రులకు సంబంధించి ప్రతినిధులు జెమ్స్ నుండి జనరల్ మేనేజర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, కిమ్స్ నుండి సోమేశ్వరరావు, మెడికవర్ నుండి మేనేజర్ శివకుమార్, తదితర ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి

## - శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ -

(సత్యంన్యూస్, గార)




అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే గొండుశంకర్ అన్నారు. గార మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అడిగిన పలు ప్రశ్నలకు వివిధ శాఖల అధికారులు సమాధానమిచ్చారు. గ్రామాల్లోని సమస్యలు, అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులు చర్చించారు. పలు గ్రామాలకు బస్సు సౌకర్యం కావాలని కోరారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి అధికారులు కలిసికట్టుగా సాగాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉందని, అధికారులు, వైద్యులు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. శివారు ప్రాంతాలకు కూడా సాగునీరు అందించి రైతులను ఆదుకుంటామని, రైతులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని, త్వరలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని, ప్రజలకు మురుగు సమస్య లేకుండా చేయడం తమ లక్ష్యమని తెలిపారు. వ్యవసాయ రంగంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ, ఎంపీడీవో, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళ ప్రాణాలు కాపాడిన ఉమెన్ పోలీసులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



అర్ధరాత్రి వేళలో సకాలంలో స్పందించి మహిళ ప్రాణాలను గార పోలీసు స్టేషన్ ఉమెన్ కానిస్టేబుల్, ఉమెన్ హోంగార్డులు కాపాడారు. విధి నిర్వహణలో భాగంగా గార పోలీసు స్టేషన్లో నైట్ డ్యూటీలో ఉమెన్ కానిస్టేబుల్ ఉషారాణి, ఉమెన్ హోం గార్డు రాజ్యలక్ష్మి ఉన్నారు. శుక్రవారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఓ మాహిళ పెల్లిలో వంట పని ముగించి ఇంటికి తిరిగి నడిచి వెళ్తున్న సమయంలో మార్గ మధ్యంలో గార పోలీసు స్టేషన్ దగ్గరలో మహిళ కాలు పాదం మీద పాము కాటు వేసింది. నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళ ఏమి చేయాలో తోచక భయభ్రాంతులకు గురై దగ్గరలోని గార పోలీసు స్టేషన్‌కు చేరుకొని పోలీసులు సహాయాన్ని ఆశ్రయించింది. నైట్ డ్యూటీలో ఉన్న ఉమెన్ కానిస్టేబుల్, ఉమెన్ హోం గార్డు మహిళ వద్దకు చేరుకుని ధైర్యం చెప్పి 108 అంబులెన్స్ ఫోన్ కాల్ చేసి, అంబులెన్స్ ఎక్కించి దగ్గరలో ఉన్న ప్రైమరీ హెల్త్ కేంద్రంలో ప్రథమ చికిత్స చెయించారు. సకాలంలో స్పందించి మహిళ ప్రాణాలు కాపాడిన విషయాన్ని తెలుసుకున్న ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి వీరిని అభినందించారు.

# బదిలీలైతే బాగోతాలు బయటపడతాయ్!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కమిటీ ఏదైనా.. మార్గదర్శకాలు ఎలా ఉన్నా అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేకుండా బదిలీలు, పోస్టింగులు ఇచ్చే పరిస్థితి ఇప్పుడు, ఎప్పుడూ లేదు. ప్రస్తుతం ప్రారంభమైన బదిలీల ప్రక్రియలోనూ ఇదే జరుగుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. విద్య, వైద్యఆరోగ్య శాఖలు మినహా మిగిలిన అన్ని శాఖల్లోనూ బదిలీల ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ నెల 18న జారీచేసిన జీవో నెం.75 ప్రకారం ఈ నెల 31లోగా బదిలీలు, పోస్టుల ప్రక్రియ ముగించాలని ఆదేశించింది. ఒక్క ఎక్సైజ్ శాఖలో మాత్రం వచ్చే నెల ఐదో తేదీ నుంచి 15వ తేదీ మధ్య బదిలీలు చేపట్టనున్నారు. మిగతా శాఖల సంగతెలా ఉన్నా కీలకమైన రెవెన్యూ శాఖలో బదిలీలు మాత్రం మొదటినుంచీ ప్రహసనప్రాయంగా సాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. ఇప్పుడూ దానికి మినహాయింపు లేదన్నట్లే కనిపిస్తోంది. వివిధస్థాయిల రెవెన్యూ ఉద్యోగులు తమకు అనువైన ప్రాంతాల్లో పోస్టింగు వేయించుకునేందుకు అప్పుడే రాజకీయ సిఫార్సుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సిఫార్సులకు తోడు బదిలీల ప్రక్రియలో పొందుపర్చిన పలు నిబంధనలు రెవెన్యూ ఉద్యోగులను ఏళ్ల తరబడి ఒక ప్రాంతం చుట్టూనే బదిలీల పేరుతో తిరుగుతూ వ్యవస్థను తమ గుప్పిట్లో పెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించే అవకాశం కల్పిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి.

రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న బదిలీల ప్రక్రియలో అగ్రభాగం రెవెన్యూ శాఖదే. ఆ మేరకు కలెక్టర్, జేసీ, డీఆర్వోలతో కూడిన కమిటీల ఆధ్వర్యంలో బదిలీలు చేపట్టాలని రెవెన్యూ శాఖ ఆదేశాలు జారీ చేసింది. డిప్యూటీ తహసీల్దార్, అంతకంటే కిందిస్థాయి ఉద్యోగుల బదిలీలకు జేసీ, డీఆర్వోలతో కమిటీ ఏర్పాటు చేశారు. తహసీల్దార్లు, వీఆర్వోల బదిలీల బాధ్యతను కలెక్టర్ నేతృత్వంలోని కమిటీకి అప్పగించారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో బదిలీల ప్రక్రియను ఉమ్మడి జిల్లా కలెక్టర్, విభజిత జిల్లా డీఆర్వోలకు అప్పగించారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల నుంచి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సిఫార్సు లేఖలతో కూడిన జాబితాలను కలెక్టరేట్‌కు అందించారు. వాటికి అనుగుణంగా బదిలీలు, పోస్టింగులకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఉద్యోగ సంఘాల్లో ప్రతినిధులుగా ఉన్న ఉద్యోగులు, అధికారులకు బదిలీల నుంచి మినహాయింపు ఉంటుందని భావిస్తున్నారు. కాగా గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటై 56 నెలలు పూర్తి కావడంతో వారికి కూడా బదిలీ ఉత్తర్వులు వర్తింపజేస్తున్నారు. దాంతో వారంతా ప్రజాప్రతినిధుల సిఫార్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. 2019–24 మధ్య ఒకేచోట పని చేసిన వారందరినీ మార్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షలో చంద్రబాబు సూచించారు.

**లోపాలు సరిదిద్దకపోవడమే కారణం**

ప్రజలకు చేరువగా ఉంటూ అధికశాతం ప్రభుత్వ సేవలు అందించేది రెవెన్యూశాఖే. అదేవిధంగా ఎక్కువ అవినీతి ముద్ర పడేది కూడా ఈశాఖ పైనే. వ్యవస్థాగత లోపాలు సరిచేసే బాధ్యతను ఎవరూ తీసుకోకపోవడం వల్లే ఈ శాఖ ప్రతిష్ట మసకబారిందని ఆ శాఖ రిటైర్డ్ అధికారులు చాలామంది అభిప్రాయపడుతున్నారు. రాజకీయ ప్రాపకంతో చాలామంది మార్గదర్శకాలను తుంగలో తొక్కి అనుకూలమైన పోస్టింగులు పొందుతుండటం వల్ల రెవెన్యూ ప్రతిష్ట దిగజారుతోందని విమర్శలు ఉన్నాయి. రాజకీయ సిఫార్సులతో ఏళ్లతరబడి సొంత మండలాల్లోనో, ఒకే మండలంలోనో పనిచేయడంవల్ల స్థానిక నాయకుల ఒత్తిడి, ప్రలోభాలకు లోనై ఉద్యోగులు అవకతవకలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వ్యవస్థలో ఉన్న లోపాలను ఆసరా చేసుకొని స్థానిక ప్రజాప్రతినిధులతో అంటకాగుతూ ఇచ్చిపుచ్చుకొనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. దాంతో రెవెన్యూలో నిజాయితీ అన్న మాటకు చోటు లేకుండాపోయిందంటున్నారు. వీఆర్వోలకు సొంత మండలంలో పోస్టింగ్ ఇవ్వకూడదన్న వాదన ఎప్పటి నుంచో ఉంది. కానీ ప్రస్తుత బదిలీ మార్గదర్శకాల ప్రకారం గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుంటున్నారు. దీనివల్ల ఒక్కో గ్రామ పంచాయతీలో ఐదేళ్లు చొప్పున సర్వీస్ అంతా ఒకే మండలంలోని గ్రామాల్లోనే పూర్తి చేసే పరిస్థితి ఉంది. ఒకే మండలంలో సుదీర్ఘ కాలం పనిచేయడం వల్ల శాఖలోని గుట్టుమట్లన్నీ తెలుసుకుని రికార్డుల ట్యాంపరింగ్‌కు పాల్పడుతున్నారు. మరికొందరు రికార్డులను ఇళ్లలో పెట్టుకుని మిస్సింగ్ అని చూపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇంటివద్దే వాటిని తారుమారు చేసేస్తున్నారు. ఫలితంగా మండలాల్లో 80శాతం రెవెన్యూ రికార్డులు మాయమవడమో, ట్యాంపరింగ్‌కు గురి కావడమో జరిగింది. దీనికి పలాస మండలమే నిలువెత్తు నిదర్శనం. ఈ మండలానికి చెందిన రెవెన్యూ రికార్డులు చాలా వరకు అందుబాటులో లేవు. అలాగే ప్రతి ఎన్నికల తర్వాత టెక్కలి తహసీల్దార్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ కావడం సర్వసాధారణం. ఈ నేపథ్యంలో వీఆర్వోలను గ్రామం యూనిట్‌గా కాకుండా మండలాన్నో, నియోజకవర్గాన్నో యూనిట్‌గా బదిలీలు చేయాలన్న సూచనలు అందుతున్నాయి. మండలం లేదా నియోజకవర్గంలో ఐదేళ్లు పనిచేసిన వీఆర్వోలను తప్పనిసరిగా మండలం దాటించి బదిలీ చేయాలన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**ఏళ్ల తరబడి ఒకేచోట తిష్ట**

తహసీల్దార్ నుంచి వీఆర్వో వరకు రాజకీయ నాయకుల సిఫార్సు తప్పనిసరి అయిపోయింది. పలాసలో 2019 ఆగస్టు నుంచి 2024 మార్చి వరకు ఒకే తహసీల్దారు కొనసాగారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అప్పుడు కూడా సార్వత్రిక ఎన్నికల కారణంగా తప్పనిసరి పరిస్థితుల్లో బదిలీ చేయకతప్పలేదు. చాలా మండలాల్లో ఇదే రీతిలో డీటీలు, సర్వేయర్లు, సీనియర్ సహాయకులు ఏళ్ల తరబడి పని చేస్తున్నారు. దీనికి కారణం స్థానిక ప్రజాప్రతినిధుల సిఫార్సులే. రెవెన్యూలో నిజాయితీకి తావులేదని అనేక సందర్భాల్లో వెలుగులోకి వచ్చింది. శాఖాపరమైన చర్యలు, ఛార్జిమెమోలు అందుకున్నవారిని, సస్పెండైనవారిని ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసి సొంత మండలాలకు తెచ్చుకుంటున్నారు. అర్హత లేకపోయినా పోస్టింగులు ఇప్పించుకుంటున్నారు. అదే సమయంలో స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పినట్టు పని చేయని వారిపై రోజుల వ్యవధిలోనే బదిలీ వేటు వేస్తున్నారు. ఇక క్షేత్రస్థాయి సిబ్బంది నియామకాల్లో స్థానిక సంస్థల ప్రతినిధుల ప్రమేయం ఉంటోంది. తాము చెప్పినవారిని నియమించకపోతే పార్టీకి రాజీనామా చేస్తామని హెచ్చరించే పరిస్థితి చాలాచోట్ల ఉంది.

**సాంకేతిక అందుకోలేని దుస్థితి**

పంచాయతీరాజ్ వ్యవస్థలో పంచాయతీ కార్యదర్శికి డిగ్రీ ఉత్తీర్ణత తప్పనిసరి. అదే రెవెన్యూలో ఏడు, పది తరగతులు పాసైనవారు వీఆర్వోలుగా ఉన్నారు. తలయారీ, నామినీ వ్యవస్థ నుంచి వచ్చినవారిలో ఎక్కువమంది ఏడో తరగతి పాసైన వారే. గ్రామస్థాయిలో వీరంతా బలమైన వ్యవస్థగా ఏర్పడి శాసిస్తున్న పరిస్థితి ఉంది. ఇటువంటివారు ఆధునిక సాంకేతికతను అందుకోలేక ప్రజలకు సేవలు అందించడంలో తీవ్ర జాప్యానికి కారణమవుతున్నారని విమర్శలున్నాయి. వీరు మండలాన్ని విడిచివెళ్లే పరిస్థితి గానీ, పనిచేస్తున్న గ్రామాల నుంచి కదిలించే అవకాశం గానీ లేవు. ఏ ప్రభుత్వం అధి కారంలో ఉన్నా వీరి జోలికి వెళ్లదు. దీంతో వీరి బదిలీలు, పోస్టింగుల విషయంలో ప్రజాప్రతినిధులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. 2014–19 మధ్య పని చేసిన వారిని ఏరికోరి తెచ్చుకొనే ప్రయత్నాల్లో గ్రామస్థాయి నాయకులు ఉన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.